

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
Postal No: 3-78(D)-2026-2028
RNI APTEL 2013/54510




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 293 | పేజీలు - 08 | వెల - 05/- | సోమవారం 19-10-2026

## చివరి రోజు భారీగా నామినేషన్లు!

దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం

- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర

మిగతా 2లో



## విజయవాడ మేయర్

### అభ్యర్థిగా నామినేషన్ వేసిన వంగవీటి రాధా

- కూటమి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన తరఫున బరిలోకి
- భారీ ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారికి పత్రాల సమర్పణ
- సీఎం, డిప్యూటీ సీఎం సహకారంతో నగరాభివృద్ధి హామీ



జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధా) విజయవాడ మేయర్ బరిలో నిలిచారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఆయన ఇవాళ తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి తన కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం

మిగతాది 2లో



## నితీశ్‌పై పీకే అనూహ్య ప్రశంసలు..

- నితీశ్ ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పనిచేశారన్న ప్రశంస
- వైశాలి పడవ ప్రమాద బాధితులతో దసరా జరుపుకుంటానని ప్రకటన
- కులం, మతం పక్కన పెట్టి ఓటెయ్యాలని ప్రజలకు పిలుపు

జన సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే), బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై అనూహ్యంగా ప్రశంసల వర్షం కురిపించారు.

మిగతాది 2లో

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. గవర్నర్‌ను కలిసిన జగన్

- స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార పక్షం అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు
- ఎన్నికల ప్రక్రియకు కేంద్ర బలగాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ఓటమి భయంతోనే చంద్రబాబు దాడులు చేయిస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టీకరణ




రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు.

మిగతాది 2లో

## ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?

- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు
- 2021 స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులకు జగన్
- సమాధానం చెప్పాలని డిమాండ్
- నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలం తగ్గింపు ఆర్డినెన్స్‌ను గుర్తు చేసిన మంత్రి
- బెదిరింపుల వల్లే నాడు ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిందని వెల్లడి
- ఎన్నికల హింసపై నిష్పాక్షిక విచారణ జరిపిస్తామని హామీ



ప్రజాస్వామ్యం గురించి నేడు మాట్లాడుతున్న జగన్, వారి హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అరాచకాలకు ముందుగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ..

మిగతాది 2లో

## రాయచోటికి పంజాబ్, పుంగనూరుకు బెంగళూరు గ్యాంగులను తెచ్చారు!

ఎస్ఈసీని తిట్టి మళ్లీ ఆయన దగ్గరకే వెళ్లారని జగన్‌పై విమర్శలు

- స్థానిక ఎన్నికల్లో వైసీపీనే ఉద్దేశపూర్వకంగా గొడవలు చేస్తోందన్న నరేంద్ర
- 2021లో చేసిన అరాచకాలకు ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నారని వ్యాఖ్య



స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో వైసీపీ ఉద్దేశపూర్వకంగానే అలజడులు సృష్టిస్తోందని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్ ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగిపోవడం వల్లే 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని అన్నారు.రాయచోటికి పంజాబ్ గ్యాంగ్‌ను, పుంగనూరుకు బెంగళూరు గ్యాంగ్‌ను వైసీపీనే తీసుకొచ్చిందని నరేంద్ర ఆరోపించారు. పులివెందులలో ఎంపీ అవినాశ్ రెడ్డి 200 మందితో పోలింగ్ కేంద్రానికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కేవలం ఐదు చోట్ల జరిగిన ఘటనలను

మిగతాది 2లో

## భారత్ ఆగ్రహం.. దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్..

- హెచ్-1బీ వీసాదారులపై చేసిన ‘బానిసలు’ వ్యాఖ్యలపై వాన్స్ వివరణ
- నా మాటలు సరికావు, ఆ తప్పు తనదేనని అంగీకరించిన వైనం
- భారత్ నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైన తర్వాత ఉపాధ్యక్షుడి స్పందన
- తన విమర్శ కంపెనీల విధానాలపైనే కానీ, ఉద్యోగులను ఉద్దేశించి కాదని స్పష్టీకరణ

2



## ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్!

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

మిగతాది 2లో

# నితీశ్‌పై పీకే అనూహ్య ప్రశంసలు..

బీహార్ చరిత్రలోనే అత్యంత సమర్థవంతమైన, సమాజం పట్ల శ్రద్ధ ఉన్న పది మంది ఉత్తమ నేతల్లో నితీశ్ ఒకరని అభివర్ణించారు. వైశాలిలో బీహార్ శాసనమండలి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ కుమార్ గురించి పీకే మాట్లాడుతూ, "ఆయన ఆరోగ్యంగా, చురుకుగా ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశారు. అయితే, ఆయన అనారోగ్యంతో ఉన్న సమయంలో ఇతరులు ఆయన పేరుతో ప్రభుత్వాన్ని నడిపారు. ఆ సమయంలో జరిగిన అనేక అవకతవకలను నేను వ్యతిరేకించాను" అని గుర్తుచేశారు. జేడీయూ ఎమ్మెల్యే అనంత్ సింగ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోనూ నితీశ్‌ను సమర్థిస్తూ, ఆయనను ఒక వివేకవంతమైన నాయకుడిగా అభివర్ణించారు. పాట్నా గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో నితీశ్‌కు బలమైన మద్దతు ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఓటర్లను ఆకట్టుకునే వ్యూహంలో భాగంగానే పీకే ఈ వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో నితీశ్‌కు అత్యంత సన్నిహితుడిగా, జేడీయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా పీకే పనిచేసిన విషయం తెలిసిందే. మరోవైపు, ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వైరల్ అవుతున్న వీడియో క్లిప్‌పైనా పీకే స్పందించారు. "పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన ప్రతి ఒక్కరినీ కాల్చివేయాలనే వాదన సరైతే, ఆ లెక్కన సామ్రాట్ చౌదరి కూడా నేరస్థుడే అవుతారు. నా వ్యాఖ్యలు తప్పయితే ప్రభుత్వం నాపై కేసు నమోదు చేయవచ్చు" అని సవాల్ విసిరారు. కులం, మతాలకు అతీతంగా విద్య, ఉపాధి, ఉపాధ్యాయుల గౌరవం కోసం ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఇదే ప్రచారంలో భాగంగా వైశాలిలో జరిగిన పడవ ప్రమాదంలో 15 మంది చిన్నారులు మరణించడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దసరా పండుగను ఆ బాధిత కుటుంబాలతోనే గడుపుతానని ప్రకటించారు. వారిని పరామర్శించడానికి ఎన్డీయే ప్రభుత్వం నుంచి ఎవరూ రాకపోవడాన్ని తప్పుబట్టారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. గవర్నర్‌ను కలిసిన జగన్

అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

### ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార టీడీపీ కూటమి అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎస్ఈసీని ముఖ్యమంత్రి చంద్రబాబే నియమించారని, ఆయన ఆదేశాల మేరకే ఎస్ఈసీ పనిచేస్తున్నారని జగన్ ఆరోపించారు.

# రాయచోటికి పంజాబ్, పుంగనూరుకు బెంగళూరు గ్యాంగులను తెచ్చారు

గ్యాంగ్‌ను వైసీపీనే తీసుకొచ్చిందని నరేంద్ర ఆరోపించారు. పులివెందులలో ఎంపీ అవినాశ్ రెడ్డి 200 మందితో పోలింగ్ కేంద్రానికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. కేవలం ఐదు చోట్ల జరిగిన ఘటనలను రాష్ట్రవ్యాప్త అల్లర్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ తలుచుకుంటే వైసీపీ నామినేషన్లు కూడా వేయలేని పరిస్థితి ఉండేదని అన్నారు.

పుంగనూరు, పులివెందుల, రాయచోటిలో దశాబ్దాలుగా సాగిన అణచివేత కారణంగానే ఇప్పుడు ప్రజలు వైసీపీకి వ్యతిరేకంగా తిరగబడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లిలో ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను దూషించిన జగన్, ఇప్పుడు మళ్లీ ఆయన దగ్గరకే వెళ్లారని ఎద్దేవా చేశారు.

"వెయ్యి గొడ్డులు తిని నేను శాఖాహారిని అని చెప్పుకునే వ్యక్తిలా జగన్ తీరు ఉంది. తన హయాంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై నీతులు చెబుతున్నారు" అని ధూళిపాళ్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగాయని జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం ఫలితాలు రాకపోతే మంత్రి పదవులు, టికెట్లు ఉండవని సొంత పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను బహిరంగంగానే బెదిరించారని నరేంద్రకుమార్ ఆరోపించారు. ఆ బెదిరింపుల ఫలితంగానే రాష్ట్రంలో అపూర్వమైన రీతిలో ఏకగ్రీవాలు జరిగాయని అన్నారు. "2021 ఎన్నికల్లో ఎంపీటీసీల్లో 25 శాతానికి పైగా, జెడ్పీటీసీల్లోనూ అదే స్థాయిలో ఏకగ్రీవాలు అయ్యాయి. ఒక్క కడప జిల్లాలోనే 553 ఎంపీటీసీలకు 439 (దాదాపు 80%), 50 జెడ్పీటీసీలకు 38 (78%) ఏకగ్రీవం కావడం భారతదేశ చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయం. ఇవన్నీ బెదిరింపులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లతో సాధించినవే," అని ఆయన గణాంకాలతో సహా వివరించారు.

పులివెందుల, పుంగనూరు, ధర్మవరం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో నామినేషన్లు వేసేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థులపై వైసీపీ గూండాలు దాడులు చేశారని ధూళిపాళ్ల గుర్తుచేశారు. మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, న్యాయవాది కిశోర్‌ల కారుపై జరిగిన దాడిని ప్రస్తావించారు. "అభ్యర్థులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి, గన్ పెట్టి బెదిరించి నామినేషన్లు విత్‌డ్రా చేయించిన ఘటనలు అనేకం ఉన్నాయి. చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో ఎస్పీలను బదిలీ చేయాలని, పలమనేరు, శ్రీకాళహస్తి, పులివెందులలో డీఎస్పీలపై చర్యలు తీసుకోవాలని అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) సిఫార్సు చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు" అని విమర్శించారు.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పైనే కులం పేరుతో బురదజల్లి, ఆయన కుటుంబాన్ని బెదిరించారని నరేంద్రకుమార్ ఆరోపించారు. ప్రాణహాని ఉందని, కేంద్ర బలగాల రక్షణ కావాలని 18.03.2020న హోం సెక్రటరీకి నిమ్మగడ్డ రాసిన లేఖను ఆయన ప్రస్తావించారు. ఆ లేఖలో 35 హింసాత్మక ఘటనలు, 23 బలవంతపు విత్‌డ్రాలు, మొదటి దశలో 55 హింసా సంఘటనలు జరిగినట్లు ఎస్ఈసీ స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. టీడీపీతో పాటు బీజేపీ, జనసేన అభ్యర్థులపైనా దాడులు జరిగాయని నివేదించారని గుర్తుచేశారు.

ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పులివెందుల, పలమనేరు, రాయచోటి, పుంగనూరు వంటి ప్రాంతాల్లో వైసీపీ మళ్లీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ధూళిపాళ్ల ఆరోపించారు. "11 సీట్లకే పరిమితమైనా వారిలో మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అందించిన పాలన చూసి ప్రజలు మాతో నడుస్తున్నారు. ఇది చూసి ఓర్వలేక, విధ్వంసం సృష్టించి ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. 2021లో చేసిన పాపాల ఫలితాన్ని ఇప్పుడు అనుభవించబోతున్నారు. ప్రజలు గతాన్ని గుర్తుంచుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతారు" అని ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై జరిగిన దాడులను, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను గుర్తు చేస్తూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నేడు ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న జగన్ గారిని నేను ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు, మీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ముందు సమాధానం చెప్పండి. ఆ తర్వాతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకు ఉంటుంది. ఆనాడు మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్ధా వెంకన్నల వాహనంపై మీ పార్టీ శ్రేణులు దాడి చేసినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా? పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేసినప్పుడు రాజ్యాంగం ఏమైంది? మీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్నారని వచ్చిన వేలాది ఫిర్యాదులకు మీ దగ్గర సమాధానం ఉందా? వీటన్నిటికీ జవాబు చెప్పకుండా ఈరోజు మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు కదా? మరి నాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఆ చర్యను హైకోర్టు తప్పుబడుతూ కొట్టివేసిన విషయం మర్చిపోయారా? మీ హయాంలో బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ద్వారా ఏకగ్రీవాలు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందో చెప్పాలి. మీ పార్టీ నాయకుల దాడులు, బెదిరింపులతో మా కార్యకర్తల ప్రాణాలు కాపాడుకోవడమే గగనమైంది. అందుకే, తప్పనిసరి పరిస్థితుల్లో మేము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చింది. ఈ విషయం మీరు మర్చిపోయినా, ప్రజలు మర్చిపోలేదు. మిథున్‌రెడ్డి ఘటనతో సహా అన్ని ఎన్నికల హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానమే. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను" అని స్పష్టం చేశారు.

# చివరి రోజు భారీగా నామినేషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

**దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ**

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**తదుపరి షెడ్యూల్ ఇదే:** నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

# విజయవాడ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వంగవీటి రాధా

(మొదటి పేజీ తరువాయి)

కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి తన కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీల పూర్తి ఆమోదంతోనే తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. కూటమి మద్దతుతో తన విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగర ఎమ్మెల్యేల సహకారంతో విజయవాడను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దివంగత కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా కుమారుడైన రాధా, గతంలో కాంగ్రెస్, ప్రజారాజ్యం, వైఎస్సార్సీపీ, టీడీపీ వంటి పార్టీలలో పనిచేసి ఇటీవలే జనసేన పార్టీలో చేరారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయవాడ మేయర్ పోరు ఆసక్తికరంగా మారింది.

# భారత్ ఆగ్రహం.. దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్..

(మొదటి పేజీ తరువాయి)

హెచ్-1బీ వీసాదారులను 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' (ఒప్పంద బానిసలు) అని సంబోధిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆ పదప్రయోగం సరికాదని అంగీకరించారు. తన విమర్శ ఉద్యోగులను ఉద్దేశించి కాదని, అమెరికా కంపెనీలు అనుసరిస్తున్న వీసా విధానాలను లక్ష్యంగా చేసుకుని మాత్రమే అని స్పష్టం చేశారు. భారత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సీబీఎస్ నిర్వహించిన ఒక టౌన్‌హాల్ కార్యక్రమంలో జేడీ వాన్స్ మాట్లాడుతూ..

"నా మాటలు సరైనవి కావు, ఆ తప్పు నాదే" అని అంగీకరించారు. అమెరికన్లతో భర్తీ చేయలేని ఉద్యోగాలని చెప్పి, విదేశీ నిపుణులను నియమించుకుంటున్న కంపెనీల గురించే తాను మాట్లాడానని వివరించారు.

వీసాపై ఆధారపడి పనిచేయడం వల్ల ఉద్యోగులు యాజమాన్యాల చేతిలో శక్తిహీనులుగా మారుతున్నారని, ఉద్యోగం పోతే తమ దేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తుందన్న భయంతో వారు ఫిర్యాదు చేయడానికి కూడా సాహసించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ బలహీనతను కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని వాన్స్ ఆరోపించారు.

ఈ నెల ప్రారంభంలో వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' అనే పదం అత్యంత అవమానకరమని, దీని వెనుక బాధాకరమైన చారిత్రక, వలసవాద నేపథ్యం ఉందని భారత్ స్పష్టం చేసింది. భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, నైపుణ్యం కలవారని, వారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణలకు ఎనలేని సేవలందిస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తుచేసింది. తరతరాలుగా వలస వచ్చిన వారి వల్లే అమెరికా చరిత్ర రూపుదిద్దుకుందన్న విషయాన్ని కూడా నొక్కి చెప్పింది.

కొన్ని ఐటీ సంస్థలను గ్రీన్ కార్డ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా జేడీ వాన్స్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ నిపుణులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. తాజాగా వాన్స్ వివరణతో ఈ వివాదం కొంత సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

# ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్

ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

# దుర్గాదేవి రూపంలో అలంకారం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 18: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో 8వ రోజు అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించారు. అమ్మవారికి అర్చనా నవగ్రహ మండపారాధన మహా మంగళ హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ గావించారు. బండి ఆత్మకూరుకు చెందిన ఉభయ దాతలు దేసు సుంకి రెడ్డి, వరలక్ష్మమ్మ, ఈర్నపాడు గ్రామానికి చెందిన పుల్యాల మహేశ్వర రెడ్డి, ఉమాదేవి, దంపతులు ఆలయంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగప్రసాద్, దేవస్థానం చైర్మన్ అల్లె చెన్నారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు భాస్కర శర్మ సురేష్ శర్మ తో పాటు భక్తులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. బండి ఆత్మకూరు లోని జనార్ధన స్వామి దేవాలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయంలో కూడా అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాల వితరణ గావించారు.

## దుర్గాదేవిగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

గడివేముల: మండల కేంద్రం గడివేముల లోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నాడు శ్రీమత్ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ అర్చకులు వసంత లక్ష్మి ఆధ్వర్యంలో ఆశ్వయుజ శుద్ధ అష్టమి పూర్వాషాఢ, ఉత్తరాషాడ నక్షత్రము నందు దుర్గాదేవి అష్టోత్తర శతనామావళి పటించారు. శ్రీ దుర్గా మూలమంత్ర హోమం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వసంత లక్ష్మి మాట్లాడుతూ నవరాత్రి సందర్భంగా 8 వ రోజున పూజింపబడే దుర్గామాత యొక్క అత్యంత భయంకరమైన మరియు హింసాత్మక రూపంగా కాళికా దేవత అని నమ్ముతారని శుంభ మరియు నిశుంభ అనే రాక్షసులను చంపడానికి పార్వతి దేవి తన దివ్యమైన బంగారు చర్మాన్ని ఒలిచినప్పుడు కాళరాత్రి దేవి ఆవిర్భవించిందని ఆమె తెలిపారు. ఆమె తన భక్తులను రక్షించడంలో మరియు వారి కోరికలన్నింటినీ నెరవేర్చడంలో దయగలదని అన్నారు. అలాగే సుహాసిని పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గడివేము ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా,గడివేముల మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఉదయగిరి శివయ్య, ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు,ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.



# ఎంపీటీసీ,జడ్పిటిసిఎన్నికలపైరాజకీయ పార్టీలప్రతినిధులతో సమావేశం



దొర్నిపాడు అక్టోబర్ 18 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ ప్రకారం త్వరలో జరగబోయే ఎంపీటీసీ ,జడ్పిటిసి ఎన్నికలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు, ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన దొర్నిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించే ఎంపీటీసీ, జెడ్పీటీసీ 2026ఎన్నికల నిర్వహణ కొరకు రాజకీయపార్టీ ప్రతినిధులతో చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు, ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరై అధికారులకు సహకరించాలని ఆమె కోరారు

# నేడు నగరపాలకలో పీజీఆర్ఎస్ రద్దు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# కొత్తూరులో నిత్య అన్నదానం ప్రారంభం.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, కొత్తూరు గ్రామం నందు కంప మల్ల నాగ పుల్లయ్య శర్మ మరియు వారి ధర్మపత్ని సావిత్రమ్మ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం సెప్టెంబర్ నుండి ప్రారంభించినట్లు కంపమల్ల నాగ పుల్లయ్య శర్మ తెలిపారు. ఈ సందర్భంగా కంపమల్ల నాగం పుల్లయ్య శర్మ మాట్లాడుతూ తిరుపతి, శ్రీశైలం, మహానంది ఓంకారం తదితర దేవస్థానాలలో నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారి కుమారులు కంపమల్ల నాగ శరభయ్య శర్మ, కంపమల్ల నారాయణ శర్మ, కంపమల్ల సుబ్బకృష్ణ శర్మ, కంపమల్ల షణ్ముఖ గణేష్ శర్మ ఆలోచనలతో, కొత్తూరు సుబ్రహ్మణ్యం స్వామి ఆశీస్సులతో కొత్తూరు గ్రామంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నిత్య అన్నదాన కార్యక్రమం భక్తులు, పాదచారులు కూడా వారి సహకారం అందిస్తున్నారని అన్నారు. ప్రతిరోజు భక్తులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం స్వయాన కంప మల్ల నాగ పుల్లయ్య శర్మ ధర్మపత్ని సావిత్రమ్మతోపాటు కుటుంబ సభ్యులే వంటకాలు చేసి వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కంప మల్ల నాగ పుల్లయ్య శర్మ వారి వంశపార్యపరముగా ప్రతి ఒక్కరికి వారి ఆధ్వర్యంలో మొండి వ్యాధులకు ఉచిత ఆయుర్వేదిక్ మందులు సర్వరోగలకు ఆయుర్వేదిక్ మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత అన్నదాన కార్యక్రమం తో పాటు ఉచిత ఆయుర్వేదిక్ మందులు కూడా భక్తులకు అందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి

**జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, బాధ్యతలపై సంబంధిత సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని కర్నూలు జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ అన్నారు. ఆదివారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్)లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను, అలాగే వెంకటరమణ కాలనీలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం, ఇందిరాగాంధీ నగర్‌లోని 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలను అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు, బాధ్యతలను ఎన్నికల సంఘం హ్యాండ్‌బుక్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు అందించిన శిక్షణలో వివరించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నికల విధులను ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అథెనా స్కూల్‌లో బ్యాలెట్ బాక్సులను తీసుకొని, పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించి తిరిగి అప్పగించేంత వరకు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సామగ్రి వినియోగం, పోలింగ్ నిర్వహణ, ఎన్నికల విధివిధానాలపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అంతకన్నా ముందు జిల్లా జనరల్ అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి, ఐఏఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ చల్లా ఓబులేసు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి, ఎన్నికల నిర్వహణ స్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్థాన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వేణుగోపాల్, 59, 60, 61 వార్డుల రిటర్నింగ్ అధికారి ఐ.డి. శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి

## అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించాలి -మంత్రి బీసీ



బనగానపల్లె , అక్టోబర్ 18, పల్లెవెలుగు స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించాలని రాష్ట్ర రోడ్లు ,భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు .ఆదివారం మండలంలోని కాపులపల్లె ఫామ్‌హౌస్‌లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నద్ధత, పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. స్థానిక పరిస్థితులు, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేపట్టాలని సూచించారు. ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లోనూ విజయదుందుభి మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే ఆదరణ ప్రతిబింబిస్తుందన్నారు. ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలన్నారు. ఓటమి భయంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలు అల్లర్లకు పాల్పడుతున్నారని మంత్రి బీసీ మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందడంపై దృష్టి పెట్టకుండా, ఓటమి భయంతో వైసీపీ నేతలు అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవాలని, ప్రజల తీర్పును గౌరవించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ కేడర్‌కు కీలకమని, గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కూటమి నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో స్థానికంగా ప్రజాదరణ, పార్టీ కోసం పనిచేసిన వారి సేవలు, గెలుపు అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ, ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సమస్యాత్మక గ్రామంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్!

**స్థానిక ఎన్నికల నేపథ్యంలో 35 మంది పోలీసులతో తనిఖీలు.**
**పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక సుమో గుర్తింపు.**




ఆదోని (పల్లె వెలుగు): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఆదోని మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన నాగనాతనహళ్లిలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని ఏఎస్పీ జయశర్మ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 6 గంటల నుంచే గ్రామంలో తనిఖీలు చేపట్టారు.
ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, రూరల్ ఎస్ఐ రామాంజనేయులు, ఇస్వి ఎస్ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో మొత్తం 35 మంది పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో గస్తీ నిర్వహిస్తూ సమస్యాత్మక వ్యక్తుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక సుమో వాహనాన్ని గుర్తించారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు పాల్పడరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు గ్రామ ప్రజలకు సూచించారు. ఎన్నికల ప్రశాంత నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.
ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

# జాతీయస్థాయి కరాటే పోటీలో రాణించాలి -బిసి రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 18, పల్లెవెలుగు




జాతీయ స్థాయి కరాటే పోటీలో రాణించి బనగానపల్లె ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బిసి రాజారెడ్డి కార్యాలయంలో జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులను బీసీ రాజారెడ్డి సన్మానించారు. 12వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల వుషు ఛాంపియన్‌షిప్--2026లో నంద్యాల జిల్లా వుషు జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు పతకాలను సాధించింది. ఈ పోటీల్లో జూనియర్ సాండా విభాగంలో కె. సాయి చరణ్ తేజ (–45 కేజీలు), సీనియర్ మహిళల ట్రెడిషనల్ విభాగంలో టి. దివ్య, సీనియర్ పురుషుల సాండా విభాగంలో ఎస్. మహమ్మద్ ఉమర్ (–80 కేజీలు), డి. కల్యాణ్ బాబు (–85 కేజీలు) స్వర్ణ పతకాలు సాధించారు. ఈసందర్భంగా జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారిని బిసి రాజారెడ్డి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రేరణ లభిస్తుందన్నారు. ఈ విజయానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ వుషు సంఘం అధ్యక్షులు ఆదిశేషు మామిళ్లపల్లి, ప్రధాన కార్యదర్శి బి. నరసింహారావు, నంద్యాల జిల్లా వుషు సంఘం అధ్యక్షులు డి. కల్యాణ్ బాబులను అభినందించారు. భవిష్యత్తులో నంద్యాల జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించేలా కృషి చేస్తామని డి. కల్యాణ్ బాబు తెలిపారు. క్రీడాకారుల విజయానికి తోడ్పడిన కోచ్‌లు, తల్లిదండ్రులను బిసి రాజారెడ్డి అభినందనలు తెలిపారు.

# అభ్యర్థుల ఎంపిక పై పార్టీల కసరత్తు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 18: ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ వెలువడుతూ ఉండటంతో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు గాను రెండు పార్టీలు దృష్టిసారించాయి. మూడు రోజులపాటు మునిసిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ముగియడంతో, ప్రస్తుతం ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలలో ఆసక్తి కనపరుస్తున్న నాయకుల జాబితాలను పరిశీలించే పనిలో పడ్డారు. వారం రోజుల క్రితమే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలకు ఆశవాహులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మండల పరిషత్తు అధ్యక్ష స్థానం బీసీ మహిళలకు కేటాయించగా, జడ్పిటిసి స్థానం జనరల్ కు కేటాయించారు. మండల పరిషత్ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు రెండు గ్రామాలకు చెందిన నాయకులు పోటీ పడుతూ ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో ఎన్నికలలో ఎంత ఖర్చయినా పెట్టేందుకు వెనుకాడ బోమని ఇద్దరు నాయకులు పేర్కొంటూ ఉండటంతో ఎంపిక విషయం ఉత్కంఠ రేపుతూ ఉంది. ప్రత్యేకించి ప్రస్తుతం జరగబోయే ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశించడంతో, అభ్యర్థుల ఎంపిక విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించడంలో తెలుగుదేశం పార్టీ దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికలలో ఆ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకుంది. ఈ పద్ధతిలో కాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి గ్రామాలలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. గ్రామాలలో జరిగిన అభివృద్ధి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తమకు కచ్చితంగా మద్దతు తెలిపే అవకాశం ఉంటుందని తెలుగుదేశం పార్టీ గట్టిగా విశ్వసిస్తూ ఉంది. ఈ మేరకు బండి ఆత్మకూరు , మహానంది మండలాలకు చెందిన గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులను అందరితో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదివారం రాత్రి తన స్వగ్రామమైన వేల్పనూరులో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలలో కార్యకర్తలు నాయకులు అనుసరించాల్సిన పద్ధతులపై వారికి దిశా నిర్దేశం చేశారు. మరోవైపు ఎం పి టి సి జెడ్పిటిసి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు గాను వైసీపీ పార్టీ రహస్య సమాలోచనలను నిర్వహిస్తూ ఉంది. గ్రామాలలో గ్రామస్థాయి నాయకులందరూ కలిసి తమ అభ్యర్థులను ఎంపిక చేసుకొని ఒక నిర్ణయానికి రావాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కార్యకర్తలకు సూచించినట్లుగా తెలుస్తోంది. ఆ దిశగా గ్రామస్థాయి నాయకులందరూ రహస్యంగా తమ అభ్యర్థులను ఎంపిక చేసుకునే విషయంలో తలమునకలవుతూ ఉన్నారు. సోమవారం నంద్యాలలో బండి ఆత్మకూరు మహానంది మండలాలకు చెందిన కార్యకర్తలను నాయకులను రప్పించుకొని సమావేశం నిర్వహించిన అనంతరం జడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థులను ప్రకటించాలని ఆ పార్టీ నిర్ణయించుకున్నట్లుగా సమాచారం అందుతూ ఉంది.

## నేడు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రా+=నా) కార్యక్రమం రద్దు

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

పల్లె వెలుగు కర్నూల్ రిపోర్టర్ దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 19వ తేదీ సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో పోలీసు అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున కర్నూలు జిల్లా కేంద్రంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రా+=నా) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి, సోమవారం కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయానికి రావద్దని ఎస్పీ సూచించారు. జిల్లా ప్రజలు, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# దుర్గాదేవిగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**-దుర్గాదేవి అలంకరణలో అమ్మవారుభక్తులకు దర్శనం**

దొర్నిపాడు అక్టోబర్ 18 పల్లె వెలుగు న్యూస్ శరన్నవరాత్రుల్లో భాగంగా దొర్నిపాడు





మండలంలోని రామచంద్రపురం గ్రామం సీతారాముల దేవాలయం నందు గ్రామ ప్రజలు పెద్దల సహకారంతో అమ్మవారిని ఏర్పాటు చేసి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు, అందులో భాగంగా ఆదివారం ఆశ్వయుజ శుద్ధ అష్టమి, పూర్వాషాడ, ఉత్తరాషాడ నక్షత్రము నందు దుర్గాదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు హేమంత్ ఆచార్యులు తెలిపారు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంకుమార్చన, సహస్రనామం శతనామావళి పటించారు. శ్రీ దుర్గా మూలమంత్ర హోమం, మహామంగళ హారతి,నవరాత్రి సందర్భంగా 8 వ రోజున పూజింపబడే దుర్గామాత యొక్క అత్యంత భయంకరమైన హింసాత్మక రూపంగా కాళికా దేవత అవతారమని ఆయన అన్నారు, అనంతరం భక్తులకు తీర్థప్రసాదములనుఅందజేసినట్లు ఆయన తెలిపారు ,ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలునిర్వహించారు,

# హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు..

# రిమాండ్‌కు తరలింపు.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం సుల్తానాపురం గ్రామంలో గులాం రసూల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు గొల్ల కొలప్ప అలియాస్ కౌలప్ప (45)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..



సుల్తానాపురం గ్రామానికి చెందిన గులాం రసూల్‌పై అదే గ్రామానికి చెందిన గొల్ల కొలప్ప దాడికి పాల్పడి హత్యాయత్నం చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడైన కొలప్పను అక్టోబర్ 18, 2026న మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో సుల్తానాపురం వెళ్లే రహదారిలోని గ్రానైట్ క్వారీ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. దాడికి ఉపయోగించినట్లు పేర్కొన్న ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడిని అరెస్టు అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ఆదర్శనగర్ గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.

**తాటికొండ విజయ... 51 వ వార్డు కౌన్సిలర్ టిడిపి అభ్యర్థి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని 51 వ వార్డు వైయస్సార్ నగర్





ను నంద్యాలలోనే ఆదర్శవార్డుగా తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమని టిడిపి అభ్యర్థి తాటికొండ విజయ, వార్డు ఇన్చార్జి తాటికొండ బుగ్గ రాముడు, యువ నాయకుడు తాటికొండ మహేష్ బాబులు అన్నారు.. ఆదివారం వారు టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి వార్డులో ఇంటింటా ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే వార్డులో కోట్లాది రూపాయల పనులు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర కార్యదర్శి ఫిరోజ్, నియోజకవర్గ నాయకుడు ఫయాజ్ ల సహకారంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. నంద్యాల మునిసిపల్ ఎన్నికల్లో 51 వ వార్డు టిడిపి అభ్యర్థి అయిన తాటికొండ విజయ సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు... 51 వ వార్డులోని వీధి వీధిని సమానంగా అభివృద్ధి చేసి పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తమ ధ్యేయమని, వార్డు ప్రజలు మేలు చేసే కూటమి అభ్యర్థినీ గెలిపించాలని కోరారు.. వైసీపీ నాయకుల బూటకపు మాటలు హామీలు నమ్మవద్దని ఇప్పటికే అభివృద్ధికి వారు చేసిన కృషి ఏమీ లేదని వారు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# ఈనెల 21 నుండి 23 వరకు ఎంపీటీసీ జడ్పీటిసి నామినేషన్ల స్వీకరణ



రుద్రవరం. పల్లె వెలుగు: రుద్రవరం మండలంలో ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ఈనెల 21 నుండి 23 వరకు ఎంపీడీవో కార్యాలయం లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఎంపిడిఓ కార్యాలయం లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది. 24వ తేదీ నామినేషన్ల పరిశీలన (స్కూటీ ఆఫ్ నామినేషన్స్). 25వ తేదీ నామినేషన్ ఫారంలో ఏవైనా తప్పిదాలు జరిగి నామినేషన్ తిరస్కరణకు గురైతే నామినేషన్ పై అప్పిలు చేసుకోవచ్చు. 26వ తేదీ నామినేషన్ల తిరస్కరణ పై ఎన్నికల అధికారి తుది నిర్ణయం ప్రకటిస్తారు. 27వ తేదీ నామినేషన్ల ఉపసంహారణకు అవకాశం అదే రోజు సాయంత్రం ఎంపీటీసీ జెడ్పీటీసీ పదవులకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఎన్నికల అధికారి నోటీసు బోర్డులో ప్రకటన చేస్తారు. నవంబర్ నెల 3 తేదీ ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ నిర్వహణ ఉంటుంది. 4వ తేదీ అవసరమైన చోట ఎన్నికల అధికారి అనుమతితో రీపోలింగ్ నిర్వహిస్తారు. 5వ తేదీ ఎంపిటిసి జడ్పిటిసి ఓట్ల లెక్కింపు ఆ వెంటనే ఫలితాల ప్రకటన గెలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారిచే ధృవీకరణ పత్రాలు అందజేస్తారు.

## దేవి నవరాత్రి దసరా మహోత్సవాల సందర్భంగాప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 18,పల్లెవెలుగు బనగానపల్లె పట్టణం మంగళవారం పేట శ్రీ వాసవి



కన్యక పరమేశ్వరి ఆలయంలో 7 వ రోజు అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారం లో భక్తులకు దర్శనం... అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి. శాలువ కప్పి ఘనంగా సత్కరించి మెమెంటో ను అందచేసిన మంగళవారం పేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఈ కార్యక్రమం లో శేష మోహన్, టివి వేణుగోపాల్,శత్రుఘ్నుడు,సముద్రాల అన్వేష్,వంకాదరి నాగరాజు,నూకల హేమంత్,ప్రవీణ్ కుమార్,సుధీర్ కుమార్,సుదర్శన్,సుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు

## దేవి నవరాత్రి దసరా మహోత్సవాల సందర్భంగాప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





బనగానపల్లె, అక్టోబర్ 18,పల్లెవెలుగు బనగానపల్లె నియోజకవర్గం అవుకు పట్టణములో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో 7 వ రోజు అమ్మవారు ధనలక్ష్మి అలంకారం లో భక్తులకు దర్శనం... అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిశాలువ కప్పి ఘనంగా సత్కరించిన అవుకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఈ కార్యక్రమం లో అవుకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మల్లెల సునీల్ కుమార్,యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లేపల్లి సురేష్ బాబు,అవుకు మండల ఆర్యవైశ్య అధ్యకుడు తాళ్లేపల్లె నాగేంద్ర, తల్లం సుబ్రమణ్యం,ఆర్యవైశ్య నాయకులు మేడం ఆంజనేయులు,సాయి ప్రసాద్,నాగరాజు,రాజేష్,సుబ్రమణ్యం, బాబి,సత్యం,రమణ,ప్రసాద్,జీవి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు అబ్జర్వర్ల నియామకం.

**జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి, ఐఏఎస్ - 78159595261**

**ఎన్నికల వ్యయ పరిశీలకురాలు పి. శ్యామల, ఐఎఫ్ఎస్ - 94408100751**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు జనరల్ అబ్జర్వర్‌గా జె. వెంకట మురళి, ఐఏఎస్, ఎన్నికల వ్యయ పరిశీలకురాలిగా పి. శ్యామల, ఐఎఫ్ఎస్ నియమితులైనట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణను జనరల్ అబ్జర్వర్ పర్యవేక్షిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాలు, నిర్దేశిత పరిమితులు, వ్యయ రికార్డుల పరిశీలనను ఎన్నికల వ్యయ పరిశీలకురాలు పర్యవేక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన అవసరమైన సమాచారం, ఫిర్యాదుల కోసం సంబంధిత అబ్జర్వర్లను వారి మొబైల్ నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## కోతకు గురైన 19వ ఉప కాలువ గట్టు - పట్టించుకోని గంగ ధికారులు....

రుద్రవరం.పల్లె వెలుగు: మండల పరిధిలోని అప్పనపల్లె గ్రామ సమీపంలో గల



తెలుగు గంగ 19వ ఉపకాల్వ గట్టు కోతకు గురైంది. కాలువ కోతకు గురవుతున్న గంగ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు రైతుల నుండి వినిపిస్తున్నాయి. గంగ ప్రధాన కాలువకు సమీపంలో అటవీ శాఖ ప్లాంటేషన్కు దగ్గర ప్రాంతంలో గంగ 19వ ఉపకాల్వ గట్టు కోతకు గురైంది. గతంలో కూడా కోతకు గురి కావడంతో మరమ్మతులు చేపట్టారని అయినా ఉపయోగం లేకుండా పోయిందని మళ్లీ కోతకు గురైందని తెలుగు గంగ కాలువకు నీళ్లు వదిలితే ఉపకాలవకు వచ్చే నీరు వృధాగా పోతుందని కోతకు గురైన కట్టను శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే కొండమాయపల్లె చెరువుకు నీరు ప్రవహించే పిల్ల కాలువ కోతకు గురి కావడంతో సొంతంగా మరమ్మతులు చేశామని రైతులు తెలుపుతున్నారు. గంగ ఉపకాలువలతోపాటు పిల్ల కాలువలు అధ్వానంగా ఉన్నా గట్లు కోతకు గురవుతున్నా గంగ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా గంగ అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న గంగ ఉపకాలువలు పిల్ల కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## పార్టీ అధికారిక బీ-ఫామ్ అందకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చ.



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపల్ చైర్మన్ పదవికి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మల్లప్ప సతీమణి స్వప్న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే, ఆమెకు ఇప్పటివరకు జనసేన పార్టీ నుంచి అధికారిక బీ-ఫామ్ అందలేదనే సమాచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్వతంత్ర అభ్యర్థిగా స్వప్న నామినేషన్ దాఖలు చేయడం, మరోవైపు పార్టీ బీ-ఫామ్ ఇంకా అందకపోవడంతో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది. జనసేన పార్టీ అధిష్ఠానం ఆమెకు బీ-ఫామ్ ఇస్తుందా? ఒకవేళ ఇస్తే నిర్ణీత గడువులోగా ఎన్నికల అధికారులకు సమర్పిస్తారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో బీ-ఫామ్ సమర్పణ కీలకం కావడంతో పార్టీ అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. దీనిపై జనసేన పార్టీ నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అయితే, పార్టీ అధిష్ఠానం బీ-ఫామ్ ఇవ్వకపోతే స్వప్న స్వతంత్ర అభ్యర్థిగానే కొనసాగుతారని జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మల్లప్ప వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఆదోని మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో స్వప్న నామినేషన్, బీ-ఫామ్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులు కి సన్మానం

బనగానపల్లె , అక్టోబర్ 18, పల్లెవెలుగు బనగానపల్లె బార్ అసోసియేషన్



అధ్యక్షులు గా ఎన్నికైన టీ వెంకటేశం అలియాస్ జేమ్స్ ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎస్సీ కాంప్లెక్స్ లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మూడింటి పెద్ద మునయ్య ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన టి వెంకటేశం ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రతాప్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామకృష్ణ, పసుపల ఎర్రన్న, యాగంటి పల్లె మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాగౌరి అలంకరణలో చౌడేశ్వరి దేవి




బనగానపల్లె, అక్టోబర్ 18, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాగౌరి అలంకరణలో చౌడేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 8వ రోజు అమ్మవారు మహాగౌరి అలంకరణలో భక్తుల పూజలు అందుకున్నారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు .సాయంత్రం ప్రకార రథోత్సవం నిర్వహించారు. భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఎన్. శ్రీనివాస రెడ్డి , ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

## మహిషాసుర మర్ధిని దేవిగా అమ్మవారి దర్శనం.

రుద్రవరం.పల్లె వెలుగు : మండల కేంద్రం రుద్రవరంలో అత్యంత



వైభవంగా జరుగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు భక్తులకు 'మహిషాసుర మర్ధిని దేవి' అలంకారంలో దర్శనమిచ్చారు. లోకకంటకుడైన మహిషాసురుడిని సంహరించి ముల్లోకాలను కాపాడిన దుర్గామాత రూపమే ఈ మహిషాసుర మర్ధిని. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు ప్రతీకగా నిలిచే ఈ ఉగ్రరూప ధారిణిని ఆరాధిస్తే శత్రు బాధలు, భయాలు, సకల విఘ్నాలు తొలగిపోయి ధైర్యసాహసాలు, అఖండ విజయాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రోచ్చారణల మధ్య మహిళలు భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం కన్నులపండువగా మహా మంగళహారతి జరిపారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పవిత్ర వేడుకలో పూజా దాతలతో పాటు ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ఆర్యవైశ్య మహిళలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని దుష్టసంహారిణి అయిన అమ్మవారి ఆశీస్సులు పొందారు.స్వతంత్ర అభ్యర్థిగా స్వప్న నామినేషన్.. జనసేన బీ-ఫామ్‌పై ఉత్కంఠ!

## 7 వవార్డు ఇండిపెండెంట్ అభ్యర్తిగా షేక్ గౌస్,,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 18 కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు



పట్టణంలోని 7వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగాషేక్ గౌస్ ఈరోజు నామినేషన్ దాఖలు వేశారు. వార్డులోని ప్రజల సమస్యలన పరిష్కరించడం యువతకు ప్రాధాన్యత కల్పించడం పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలుపుతూ యువతకు రాజకీయాలకు అతీతంగా వార్డు అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పదవి కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచానని .

7వ వార్డు ప్రజలు నాకు ఒక అవకాశం ఇస్తే, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పనిచేస్తానని షేక్ గౌస్ తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను

## ప్రశాంతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి.

**ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రతి నిబంధనను తూచా తప్పకుండా అమలు చేయాలి.**
**నగదు, మద్యం అక్రమ రవాణా, ఓటర్ల ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలి.**
**ఎన్నికల సంసిద్ధతపై అధికారులతో సమీక్షించిన జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పి. శ్యామల.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత, ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్ల పురోగతిపై ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పి. శ్యామల సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా, సబ్ కలెక్టర్ మనీషా, సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల అధికారులు, నిఘా బృందాల నియామకం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక పరిస్థితులు, భావోద్వేగాలు, ఆధిపత్య పోటీ కారణంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇతర జిల్లాల్లో చోటుచేసుకుంటున్న సంఘటనలను పరిగణనలోకి తీసుకొని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అల్లర్లు, దాడులు, దోపిడీలు వంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, లైసెన్స్ లేని ఆయుధాలు, అక్రమ ఆయుధాల వినియోగం, పెట్రోల్, కిరోసిన్ వంటి పదార్థాల అక్రమ విక్రయాలు, రవాణాపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం విక్రయాలు నిలిపివేసే నిబంధనను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. మద్యం ప్రభావంతో నేరాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి సమర్థవంతమైన శిక్షణ, తగిన అవగాహన కల్పించాలని, శిక్షణ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో పాల్గొనేలా చూడాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో ప్రతి దశను అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ, ఎన్నికల సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు, సంబంధిత డేటా భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల కదలికలు, అనుమానాస్పద కార్యకలాపాలపై వివిధ మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి, తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. నగదు పంపిణీ, మద్యం అక్రమ రవాణా, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను ముందుగానే గుర్తించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పి. శ్యామల మాట్లాడుతూ, ఎన్నికల వ్యయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితులను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రోజువారీ నివేదికలను సక్రమంగా పరిశీలిస్తూ, వ్యయ వివరాలను నిరంతరం నమోదు చేయాలని సూచించారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలు గుర్తించినప్పుడు సంబంధిత బ్యాంకు అధికారులకు సమాచారం అందించి, అవసరమైన నివేదికలను ఆదాయపు పన్ను శాఖకు పంపించాలని పేర్కొన్నారు.






నగదు, మద్యం పంపిణీ లేదా ఇతర అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలు సమన్వయంతో స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదుల కోసం వేచి చూడకుండా, క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షణ చేపట్టి అక్రమాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ అన్ని శాఖలు సమష్టిగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా మాట్లాడుతూ, జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో వార్డులను క్లస్టర్లుగా విభజించి ఎన్నికల అధికారులను నియమించామని, మున్సిపల్ చైర్‌పర్సన్ నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన గదుల కేటాయింపు, పంపిణీ-రిసెప్షన్-కౌంటింగ్ కేంద్రాల గుర్తింపు వంటి అంశాలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించి, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 28 మండలాల్లో 28 జెడ్పీటీసీ స్థానాలు, 28 ఎంపీపీలు, 377 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి 489 గ్రామ పంచాయతీలు, 4,920 వార్డుల పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.

పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నామినేషన్ల ప్రక్రియ పర్యవేక్షణ, నగదు-మద్యం అక్రమ రవాణా నిరోధం వంటి అంశాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్బన్, రూరల్ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 34 ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేశామని, ప్రతి బృందంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన ఒక్కో అధికారి ఉంటారని పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ బృందాల ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

---

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఆఖరి ఘట్టం సజావుగా పూర్తి

**- కర్నూలు నగరంలో విస్తృతంగా పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**
**- సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ చివరి రోజైన ఆదివారం ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పర్యటించి నామినేషన్, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ముందుగా ఆరోరా నగర్‌లో ఏర్పాటు చేసిన రెండు నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వీకర్ సెక్షన్ కాలనీ (రెండు ట్యాంకుల వద్ద)లోని స్వర్ణ లక్ష్మీపురం పేట సచివాలయం నామినేషన్ కేంద్రాన్ని మరియు హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించారు. చివరగా వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల దాఖలు ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల నియమ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ తో పాటు కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ, త్రీ టౌన్ సీఐ శేషయ్య, సంబంధిత ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

---

# పట్టణంలో బిజెపి పార్టీ తరఫున 40 వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి,,,,

**గణప ఉమాదేవి నామినేషన్,,,**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 18 రాష్ట్ర మరియు జిల్లా పార్టీ జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ మరియు ఎమ్మిగనూరు పట్టణ ఇన్చార్జ్ సావిత్రి మేడం ఆదేశాల మేరకు జిల్లా అధికార ప్రతినిధి గురురాజు దేశాయ్ ఆధ్వర్యంలో కూటమిలో భాగంగా బిజెపి పార్టీ తరఫున 40వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా శ్రీమతి గణప ఉమాదేవి w/o శ్రీ ఘనప వీరేష్ నామినేషన్ తో పాటు 29 వార్డు నందు శ్రీమతిఎ+ూ ఉష గారు మరియు 36 వ వార్డు బి సుష్మిత నామినేషన్లు వేయడం జరిగింది. గురురాజు దేశాయ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మరియు జిల్లా పెద్దలకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తూ. అదేవిధంగా కూటమిలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు పట్టణం నందు 03 బిజెపి కౌన్సిలర్ స్థానాలలో పోటీ చేయడానికి మద్దతు తెలిపారు. వారికి బిజెపి పార్టీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తూ తప్పకుండా పట్టణంలో కూటమి అభ్యర్థులు అయినటువంటి మున్సిపల్ చైర్ పర్సన్ మరియు 44 వార్డు కౌన్సిలర్ లను గెలిపించుకోవాలని తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో పట్టణ,నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

---

# కూటమి అభ్యర్థుల విజయానికి బీజేపీ సంపూర్ణ సహకారం!

**మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన బీజేపీ మండల నాయకత్వం**

బనగానపల్లె, అక్టోబర్ 18,పల్లెవెలుగు నంద్యాల జిల్లా సంజామల మండలంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే గ్రామాల జాబితాను బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు కు అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కృష్ణ యాదవ్ కు పంపించడం జరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ మండల అధ్యక్షులు చింతమాను చిన్న పెద్దన్న గ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు గౌరవ రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి, బీజేపీకి కేటాయించిన స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయంతో పాటు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం మండల నాయకత్వం సమష్టిగా కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి లింగన్న , మండల ప్రధాన కార్యదర్శి యగ్గోని మహేష్ , మండల ఉపాధ్యక్షులు రామాంజనేయులు , ఓబయ్య , మండల కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి , గుర్రప్ప , అమ్మడాల రామాంజనేయులు , ఓబీసీ మండల నాయకులు రంగస్వామి , పరమేష్ రెడ్డి , సోషల్ మీడియా మండల అధ్యక్షులు నట్ల కొత్తూరు రాంబాబు తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

బనగానపల్లె, అక్టోబర్ 18,పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి మార్కాపురం జిల్లా, వెలిగండ్ల గ్రామానికి చెందిన నీలం వెంకటయ్య , ఆయన సతీమణి వెంకట సుబ్బమ్మ, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ" చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు ఆదివారం అందచేశారు.



## ముస్లిం హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడుగా నూర్ బాషా



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన షేక్ నూర్ బాష ను ముస్లిం హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు గా ఆదివారం ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలోని జిల్లా ముస్లిం హక్కుల పోరాట సమితి కార్యాలయంలో మండల అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు కరాటే మాబాషా అధ్యర్యంలో ఎంపిక చేశారు అన్నారు. మహానంది మండలంలోని 10 ముస్లిం కుటుంబాలు ఎం హెచ్ పీ ఎస్ సంఘంలో చేరారన్నారు. మండల ఉపాధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి,ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు కరాటే మాబాషా కు కృతజ్ఞతలు తెలిపారు.ముస్లిం ల అభ్యున్నతి కై కృషి చేస్తానన్నారు.

## కోలాహలంగా నాగమణి నామినేషన్ దాఖలు.

-కూటమి నాయకులు, కార్యకర్తల భారీ ఎత్తున హాజరు.

-ఆదోని అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా: నాగమణి.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపల్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ కూటమి



అభ్యర్థి నాగమణి నామినేషన్ దాఖలు కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, ప్రజలు తనకు ఓటు వేసి గెలిపిస్తే ఆదోని పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి, తెలుగుదేశం పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ కె. మీనాక్షి నాయుడు, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మధుర భాస్కర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కోంకా ఉమాపతి నాయుడు, యువ నాయకులు మారుతి నాయుడు, శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో నాగమణి నామినేషన్ దాఖలు చేయడంతో కార్యక్రమం సందడిగా సాగింది.

## ఎమ్మిగనూరు 26వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా ,,,,,,

-భాస్కర్ల సుభద్రమ్మ నామినేషన్ దాఖలు,,,,,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 18 ఎమ్మిగనూరు మున్సిపాలిటీ 26వ వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా టీడీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ సతీమణి భాస్కర్ల సుభద్రమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు శాసనసభ్యులు డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో 26వ వార్డు నుంచి ఎన్నికల బరిలో నిలిచిన భాస్కర్ల సుభద్రమ్మ కి విజయాన్ని అందించాలని ఆకాంక్షిస్తున్నాం.

## ప్రశాంతంగా ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం చివరి రోజు చైర్‌పర్సన్ పదవులకు 53 నామినేషన్లు, వార్డు మెంబర్ పదవులకు 889 నామినేషన్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల వ్యవధిలో చైర్‌పర్సన్ పదవులకు మొత్తం 88 నామినేషన్లు, వార్డు మెంబర్ పదవులకు 1,443 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా నిర్వహించారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల తదుపరి ప్రక్రియను కూడా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం.

**ఆదోని చైర్‌పర్సన్ పీఠంపై ఉత్కంఠ!**

**చైర్‌పర్సన్ పదవికి 14 మంది.. కౌన్సిలర్ స్థానాలకు 415 మంది పోటీ.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపాలిటీలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో నామినేషన్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి మొత్తం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో తెలుగుదేశం పార్టీ నుంచి ఇద్దరు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు, జనసేన పార్టీ నుంచి ఇద్దరు, ఎస్‌డీపీఐ నుంచి ఇద్దరు, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు సమర్పించారు. కౌన్సిలర్ స్థానాలకు 415 మంది నామినేషన్లు మున్సిపాలిటీ కౌన్సిలర్ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొత్తం 415 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీ వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

- తెలుగుదేశం పార్టీ: 145 మంది
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ: 118 మంది
- భారతీయ జనతా పార్టీ: 56 మంది
- స్వతంత్ర అభ్యర్థులు: 38 మంది
- జనసేన పార్టీ: 15 మంది
- కాంగ్రెస్ పార్టీ: 13 మంది
- సీపీఐ: 9 మంది- ఎంఐఎం: 9 మంది
- బీఎస్పీ: 6 మంది
- సీపీఎం: 3 మంది
- ఎస్‌డీపీఐ: 3 మంది

**ప్రధాన పార్టీల మధ్య పోటీ:**నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఆదోని మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. చైర్‌పర్సన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానాలను దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది. దీంతో ఆదోని మున్సిపల్ ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది.

# మహిషాసురమర్దిని అలంకారంలో శ్రీ కామేశ్వరి అమ్మవారు

**మహాగౌరి దుర్గగా అమ్మవారి గ్రామోత్సవం**










మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు శ్రీ కామేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.అనంతరం దాతలచే యాగశాలలో హోమం,పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వేద పండితులు, రుత్వికులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కళ్యాణ మండపంలో సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి సమయంలో అశ్వవాహనంపై శ్రీ మహాగౌరి దుర్గగా శ్రీ కామేశ్వరి అమ్మవారిని అలంకరించి మాడవీధుల వెంట గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## హాలహర్వి గ్రామపంచాయతీలో వైసీపీకి అభ్యర్థుల కరువు..,,,,,

కష్టపడిన కేఆర్ కుటుంబానికి నిర్లక్ష్యం..,,,,,

ఎన్నికల వేళ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్‌కు కొత్త చిక్కులు,,,,,

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కుటుంబాన్ని పక్కనపెట్టి..,,,,

గెలుపు గుర్రాల కోసం వెతుకులాటా..,,,

హాలహర్విలో పార్టీ తరపున బరిలోకి దిగే అభ్యర్థులెక్కడ..,,,,

కేఆర్ వారసుడు రామకోటేశ్వర్ రెడ్డి తదుపరి వ్యూహంపై ఉత్కంఠ,,,,,

నాయకులను దూరం చేసుకుని.. ఎన్నికల గండాన్ని ఎలా గట్టెక్కిస్తారు..,,,,

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 18 హాలహర్వి గ్రామపంచాయతీలో పార్టీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరం మండలంలో హాలహర్వి గ్రామపంచాయతీలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ పరిస్థితి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కేఆర్ కుటుంబాన్ని కలుపుకొని వెళ్లాల్సిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నిర్లక్ష్యంతోనే ఈ దూరం ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి, ఎన్నికల వేళ అభ్యర్థుల కోసం వెతకాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందన్న ప్రశ్నలు స్థానిక రాజకీయాల్లో వినిపిస్తున్నాయి.బి కష్టపడినప్పుడు ఒకలా.. ఎన్నికలు వచ్చినప్పుడు మరోలా వ్యవహరిస్తే క్షేత్రస్థాయిలో పార్టీని నడిపేదెవరు? మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులపై నెలకొన్న సందిగ్ధతకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ సాగుతోంది. మరోవైపు, కేఆర్ కుటుంబ వారసుడు రామకోటేశ్వర్ రెడ్డి గారు సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించుతారా? పార్టీతోనే కొనసాగుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. నాయకులను దూరం చేసుకుని.. కార్యకర్తలను విస్మరించి.. ఎన్నికల్లో బలం ఎక్కడి నుంచి తెస్తారు? హాలహర్వి గ్రామపంచాయతీలో కేఆర్ కుటుంబం నిర్ణయం, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ స్పందన ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.బి

## ఆళ్లగడ్డలో ఘనంగా దుర్గాష్టమి వేడుకలు..

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 18 పల్లె వెలుగు ఆళ్లగడ్డ



పట్టణంలోని అమ్మవారి శాలలో ఆదివారం దుర్గాష్టమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవి శెట్టి హరీష్ బాబు ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్ కు అభిషేకం, స్వర్ణ దివ్య ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల కటౌట్లు విద్యుత్ దీపాలతో అలంకరించారు. దుర్గాష్టమి సందర్భంగా మహిషశుర మర్దిని అలంకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జిల్లావ్యాప్తంగా మూడు రోజుల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కర్నూలు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి పేర్కొన్నారు

మూడు రోజులు దాఖలైన మొత్తం నామినేషన్ల వివరాలు:

కర్నూలు జిల్లాలో తేది 16.10.26 నుండి 18.10.26 వరకు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలలో, గూడూరు నగర పంచాయతీలో దాఖలైన నామినేషన్ల వివరాలు

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ లో చైర్మన్ మరియు కౌన్సిలర్ల మొత్తం నామినేషన్లు - 622

లి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ లో వార్డులు 68లి

లి 16.10.26 నుండి 18.10.26 వరకు మొత్తం నామినేషన్లు 597లి

లి మేయర్ అభ్యర్థిత్వానికి దాఖలైన మొత్తం నామినేషన్లు ...25 అందులో...

టీడీపీ - 04,
వైసీపీ - 04,
బీఎస్పీ - 02,
సిపిఎం - 01,
ఐ.ఎన్.సి - 04,
ఇండిపెండెంట్లు - 05,
ఇతరులు - 05

పార్టీల వారీగా కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు:-
టీడీపీ - 175,
వైసీపీ - 176,
జనసేన - 24,
బీజేపీ - 23,
బీఎస్పీ - 06,
ఐ.ఎన్.సి - 28,
ఇండిపెండింట్లు - 126
సిపిఐ - 11,
సిపిఎం - 16,
ఇతరులు - 12,
మొత్తం నామినేషన్ల సంఖ్య - 597

---------------------------

లిఆదోని మున్సిపాలిటీ చైర్మన్ మరియు కౌన్సిలర్ల మొత్తం నామినేషన్లు. - లి

ఆదోని మున్సిపాలిటీలో వార్డులు 52



16.10.26 నుండి 18.10.26 వరకు మొత్తం నామినేషన్లు 416

పార్టీల వారీగా కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు:-
టీడీపీ - 145
వైసిపి - 119
జనసేన -15
బీజేపీ - 56
బి ఎస్పీ - 06
సి పి ఐ - 09
సి పి ఎం - 03
ఐ ఎన్ సి - 13
ఇండిపెండింట్లు - 38
ఇతరులు - 12
మొత్తం నామినేషన్ల సంఖ్య - 416

లి చైర్మన్ అభ్యర్థిత్వానికి దాఖలైన మొత్తం నామినేషన్లు 14.
లి టీడీపీ 2లి
వైసిపి 04
ఐ ఎన్ సి 01
జనసేన 02
లి ఇండిపెండెంట్ -3లి
ఇతరులు -02

ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో చైర్మన్ మరియు కౌన్సిలర్ల మొత్తం నామినేషన్లు - 238

ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో వార్డులు 44.

16.10.26 నుండి 18.10.26 వరకు మొత్తం నామినేషన్లు - 234

పార్టీల వారీగా కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు:-
టీడీపీ - 75,
వైసిపి - 68,
జనసేన -06,
బీజేపీ - 02,
సిపిఐ -01,
సిపిఎం - 01,
ఐ ఎన్ సి - 02,
అధర్ పార్టీస్ - 03,
ఇండిపెండింట్లు - 64
మొత్తం నామినేషన్ల సంఖ్య - 222

లి చైర్మన్ అభ్యర్థిత్వానికి దాఖలైన మొత్తం నామినేషన్లు 12 .
టీడీపీ 03
వైసీపీ 01
ఐఎన్సి 02
స్వతంత్ర అభ్యర్థులు 05
ఇతరులు 01

గూడూరు నగర పంచాయతీలో చైర్మన్ మరియు కౌన్సిలర్ల మొత్తం నామినేషన్లు - 127

గూడూరు నగర పంచాయతీలో వార్డులు 23.

16.10.26 నుండి 18.10.26 వరకు మొత్తం నామినేషన్లు - 119

పార్టీల వారీగా కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లు:-
టీడీపీ - 33,
వైసిపి - 33,
జనసేన -05,
బీజేపీ - 12,
ఐ ఎన్ సి - 03,
ఇండిపెండింట్లు - 33
మొత్తం నామినేషన్ల సంఖ్య - 119

లి చైర్మన్ అభ్యర్థిత్వానికి దాఖలైన మొత్తం నామినేషన్లు 08 .
టీడీపీ 01
వైసీపీ 02
బిజెపి 02
స్వతంత్ర అభ్యర్థులు 03 నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని తెలిపారు.

# దేవి నవరాత్రి దసరా మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





బనగానపల్లె, అక్టోబర్ 18,పల్లెవెలుగు కోవెలకుంట్ల పట్టణం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎనిమిదవ రోజు మహిషాసుర మర్ధిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చిన అమ్మవారు.... అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారికి ఘన స్వాగతం పలికిన కోవెలకుంట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు... ఈ కార్యక్రమం లో వైఎస్సార్సీపీ నాయకులు రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రరెడ్డి,డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి,సింగారెడ్డి రాంభూపాల్ రెడ్డి,ఆర్యవైశ్య సంఘం నాయకులు పెండేకంటి సుబ్రమణ్యం,పెండేకంటి విజయలక్ష్మి, సనత్ కుమార్,శేషపాణి తదితరులు పాల్గొన్నారు

------------------------------------

# జగ్గంపేటలో వైభవంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలు

జగ్గంపేట, అక్టోబర్ 18 శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు జగ్గంపేట టౌన్ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు ఘనంగా జన్మదిన నీరాజనాలు అర్పించారు. ముందుగా స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యకర్తలు, నాయకులకు స్వీట్లు పంపిణీ చేసి పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం నాయకులంతా కలిసి జగ్గంపేటలోని పలు ఆసుపత్రులకు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమ ఆరాధ్య దైవం, అభిమాన నాయకుడు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలను టౌన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అత్యంత సంతోషంగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలోనే ఆరు వందల కోట్ల రూపాయల అభివృద్ధిని అందించారని కొనియాడారు. ముఖ్యంగా సాగునీరు, తాగునీరు, రహదారులు, మౌలిక వసతులు, విద్యా, వైద్య రంగాలలో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడిపై ఆ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో ప్రముఖంగా ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, గెద్దాడ సత్యవేణి, వెలిశెట్టి శీను, రాయి సాయి, పీల మహేష్, పలివెల యేసురాజు, నేదురి గణేష్, సాంబత్తుల చంద్రశేఖర్, ముక్కపాల బాబు, మంతెన సంకుబాబు, దుర్గపు ప్రకాష్, మురుకుర్తి రాజు, తుమ్మల కిషోర్ తదితరులతో పాటు అత్యధిక సంఖ్యలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు



## సూళ్లూరుపేట11వ వార్డు వైసీపీ అభ్యర్థిగా నెల్లూరు దేవి నామినేషన్




సూళ్లూరుపేట, అక్టోబర్ 18 తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ 11వ వార్డు నుంచి వైఎస్సార్సీపీ అభ్యర్థిగా నెల్లూరు దేవి ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. స్థానికుల నుంచి నెల్లూరు దేవికి విశేష స్పందన లభిస్తుండటంతో ఎన్నికల బరిలో పోటీ రసవత్తరంగా మారింది. అభివృద్ధి ఆకాంక్షతో ఓటర్లు తమకే పూర్తి మద్దతు ఇస్తారని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ ప్రక్రియ అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిసింది

## నామినేషన్ కేంద్రాల వద్ద, కనీస సౌకర్యాలు కరువు



సూళ్లూరుపేట, అక్టోబర్ 18 మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా అధికారుల తీరుపై అభ్యర్థులు, ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులకు, వారితో పాటు తరలివచ్చిన ప్రజలకు కనీసం తాగడానికి మంచినీటి సదుపాయం కూడా కల్పించకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి రావడంతో తరలివచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు మంచినీళ్లు దొరకక తీవ్ర అవస్థలు పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అధికారులు మౌలిక వసతుల కల్పనను పూర్తిగా విస్మరించారని ప్రజలు మండిపడుతున్నారు. కనీస సదుపాయాలైన మంచినీరు, పారిశుధ్యం కూడా నామినేషన్ కేంద్రాల వద్ద లేకపోవడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఆయా కేంద్రాల వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఎనిమిది వేల భవానీలు అయ్యప్పలకు భిక్ష



జగ్గంపేట, అక్టోబర్ 18 ఇర్రిపాకలో ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో సుమారు ఎనిమిది వేల మంది భవానీ, అయ్యప్ప దీక్షాపరులకు, అలాగే ఇతర భక్తులకు భారీ ఎత్తున భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముందుగా విచ్చేసిన భవానీ భక్తులందరికీ సంప్రదాయబద్ధంగా కాళ్లు కడిగి పారాణి పెట్టి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అరటి డొప్పలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన నమూనా ఆలయంలో అమ్మవారికి అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. భవాని, అయ్యప్ప మాలధారణ భక్తులందరికీ భిక్ష వడ్డించిన అనంతరం జ్యోతుల అనీష్ నెహ్రూ వారికి ప్రత్యేక తాంబూలాలు అందజేశారు. జ్యోతుల నెహ్రూ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉంటూ మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ నిరంతరం ప్రజాసేవలో కొనసాగాలని భక్తులు, నాయకులు మనస్ఫూర్తిగా ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల పూనకాలు, నృత్యాలతో ఇర్రిపాక ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో దద్దరిల్లింది. ఈ విశేష కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భవానీ, అయ్యప్ప మాలధారులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు

## తిరుమలలో ఘనంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలు

తిరుమల/జగ్గంపేట, అక్టోబర్ 18 జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుకలు తిరుమలలో ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. జన్మదినాన్ని పురస్కరించుకుని ముందుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆయన సతీమణి మణి దంపతులు వేకువజామునే వీఐపీ విరామ సమయంలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో వేద పండితులు జ్యోతుల నెహ్రూ దంపతులకు స్వామివారి శేషవస్త్రం కప్పి సత్కరించారు. అనంతరం వేద ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవ చేస్తూ, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వేద పండితులు ఆయనను మనస్ఫూర్తిగా దీవించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు, టీటీడీ అధికారులు, సిబ్బంది తదితరులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా, అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరిపైనా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు



## ఎన్నికల కోడ్ నేపథ్యంలో పీజీఆర్ఎస్ రద్దు

### డిసెంబర్ 2 వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విరామం



రాజమండ్రి, అక్టోబర్ 18 రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, అక్టోబర్ 19వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి డిసెంబర్ 2వ తేదీ వరకు అమలులో ఉండనున్న నేపథ్యంలో అప్పటివరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబడదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. దసరా, విజయదశమి శుభాకాంక్షలు...దసరా నవరాత్రులు, విజయదశమి పర్వదినాలను పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ కీర్తి చేకూరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి స్ఫూర్తితో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐకమత్యంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com